# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం 28 ఫిబ్రవరి 2026


# కేజ్రీవాల్ పై కేసులు బీజేపీ కుట్ర

**పాలేరు ఫిబ్రవరి 27( నినాదం):**



ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పై తప్పుడు కేసులు బీజేపీ కుట్రేనని ఆద్మీపార్టీ పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీ లిక్కర్ స్కాము కేజ్రీవాల్ న్యాయస్థానం క్లీన్చీట్ ఇచ్చిందని అన్నారు. నీతి, నిజాయితీగా ఉన్న వారిని దెబ్బతీయాలని బీజేపీ అనేక కుట్రలు పన్నారని అన్నారు. కానీ ప్రజాస్వామ్యంలో న్యాయం గెలిచిందని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పుతో బీజేపీ కి చెంప పెట్టు అన్నారు. బీజేపీ ని త్వరలోనే ఆఫ్ పార్టీ ఉడేస్తుందని అన్నారు. త్వరలో జరగనున్న 5 రాష్ట్రాలలో 'బీజేపీ కి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రాజ్యంగ వ్యవస్థలను వాడుకుని ప్రజల నిధులు దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యం ను'కూనీ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ తీరు మారాలని.ప్రజా సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని సూచించారు.

# ఢిల్లీ సత్యగ్రహ దీక్షలో అంజిని



**పాలేరు ఫిబ్రవరి 27(నినాదం):**
ఢిల్లీ లో జరిగిన సత్యగ్రహాదీక్ష లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పాల్గొన్నారు. ఏఐ సమ్మిట్ సందర్భంగా యువజన కాంగ్రెస్ ను దేశ వ్యాప్తంగా దోషిగా చిత్రకరించే ప్రయత్నంలో అక్రమ అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఢిల్లీ లో చేపట్టిన సత్యగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంజిని మాట్లాడారు.జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్ ను అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ లో గత నాలుగు రోజులుగా దీక్ష లు చేపట్టినట్లు తెలిపారు. దశల వారీగా రాష్ట్రంలో కూడ ఆందోళన లు చేపడతామని పేర్కొన్నారు.

# ఒక్క ఫోన్‌తో కేసు నమోదు



**నూతనకల్,ఫిబ్రవరి 27 (నినాదం):**
మండల పరిధిలోని బక్కహేమ్లతండా గ్రామానికి చెందిన పాతులోతు శాంత బాధితురాలు అతని భర్త సామ్య కొట్టారని ఫోన్ ద్వారా శుక్రవారం పోలీసులకు సమాచారం అందించగానే ఎస్పీ నరసింహ ఆదేశాలతో సూర్యాపేట ఏరియా హాస్పటల్లో చికిత్స పొందుతున్న బాధితురాలకు నూతనకల్ ఎస్సై నాగరాజు కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆ కాపీని బాధితురాలకు అందజేశారు.

# సౌందర రాజన్ మరణం బాధాకరం

**-దిగ్భ్రాంతిని తెలియజేసిన మాజీ ఎంపీ, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల ఫిబ్రవరి 27 (నినాదం):-**
చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర హఠాత్ మరణం దుర్భాంతిని గురిచేసిందని మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గం మోహినాబాద్ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు సౌందర రాజన్ హఠాత్ మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య చిలుకూరు కు చేరుకుని మృతదేహానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే ధైర్యం కలగాలని కోరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# చంద్ర శేఖర్ ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం

**-సంస్కృతి స్కూల్‌లో ఘనంగా నివాళులు**




**చేవెళ్ల ఫిబ్రవరి 27 (నినాదం):-**
భారత స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా సంస్కృతి స్కూల్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ప్రత్యేక సభలో విద్యార్థులు ప్రసంగాలు చేస్తూ ఆజాద్ దేశభక్తి, త్యాగస్ఫూర్తిని గుర్తుచేశారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏ శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ రెహానా పాల్గొన్నారు.

# ధర్మపురి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**-ధర్మపురిలో దివ్య సందడి... అంకురార్పణతో నృసింహ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం**

**-పుట్ట బంగారం పూజలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**





**ధర్మపురి ఫిబ్రవరి 27(నినాదం):**
జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్స వాలు మాఘశుద్ధ ఏకాదశి శుక్రవార పర్వదినాన అంకురార్పణ కార్యక్రమం తో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం వేద ఘోషలతో మార్మోగి భక్తి పరవశ వాతావరణం నెలకొంది.

**వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు**
ఉదయాన్నే శ్రీ యోగానంద నారసింహ స్వామి ఆలయంలో స్వామి వారి నిత్య కైంకర్యాల అనంతరం బ్రహ్మోత్స వాం తర్గతంగా ఆలయ అర్చకులు, వేద పండితులు కలశ గణపతి పూజ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. పుణ్యాహ జలాలను సంప్రోక్షించి క్షేత్ర శుద్ధి కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలశస్థాపన చేసి బ్రహ్మోత్సవ కైంకర్యాల నిమిత్తం ఆచార్యాది ఋత్విక్ వర్ణణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల ఘోషల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ముంచెత్తింది.

**వరాహ తీర్థం వద్ద పుట్ట బంగారం పూజ**
సాయంత్రం వరాహ తీర్థంగా ప్రసిద్ధి చెందిన చింతామణి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో పుట్ట బంగారం పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మో త్సవాల నిమిత్తం పుట్టమన్నును వేదపం డితులు బొజ్జ రమేష్, ప్రవీణ్, దిలీప్, బొజ్జ రాజు, బొజ్జ సంపత్, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాసాచారి, నంబి నరసింహమూర్తి, బ్రహ్మోత్సవ ఆచార్యులు పురుషోత్తమాచారి తదితరులు తో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ శాస్త్రోక్తంగా సేకరించారు.

**ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉత్సవారంభం**
ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ శర్మ, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, అనేక మంది భక్తులు పాల్గొన్నారు.క్షేత్రంలో ఉత్సవాల ప్రారంభంతో పట్టణమంతా ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడుతోంది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలంకరణలతో ముస్తాబు చేశారు.

**నేడు స్వామివారి దివ్య కళ్యాణోత్సవం**
లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన తొలి ఘట్టమైన శ్రీ యోగానంద ఉగ్ర లక్ష్మీవెంకటేశ్వర స్వామివారుల క ళ్యాణోత్సవం నేడు గోధూళి సమయాన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.స్థానిక బ్రాహ్మణ సంఘం ప్రక్కనగల శ్రీమఠ మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప వేదికపై ఈ కళ్యాణ మహోత్సవం జరగ నుంది. వేలాది మంది భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో విశేష ఏర్పాట్లు చేశారు.దేవస్థానం కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్ మాట్లాడు తూ, తాగునీరు, పార్కింగ్, కూర్చునే సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దివ్య కళ్యాణాన్ని దర్శించి పుణ్యఫలాన్ని పొందాలని కోరారు

**రాష్ట్రవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం**
ధర్మపురి క్షేత్రంలో జరిగే నరసింహ బ్రహ్మోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఖ్యాతిని పొందాయి. రాబోయే రోజుల్లో వాహనసేవలు, ప్రత్యేక పూజలు, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ధర్మపురి క్షేత్రంలో ఆధ్యాత్మికోత్సవాల సందడి మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది. భక్తి, భవ్యత, వైదిక లాంఛనాల సమ్మేళనంగా నరసింహ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.

# భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించిన ఇండ్లవారి సర్వే

**-అర్హులైన పేదవారికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది**

**-తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వారు సర్వేకు సహకరించాలి**

**- జిల్లా కలెక్టర్ అనుదీప్**




**ఖమ్మం, ఫిబ్రవరి- 27(నినాదం):**
ఈ నెల 24న ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించబడిన ఇండ్లకు సంబంధించి, వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వేను వెంటనే చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టుటకు జిల్లాలోని 14 మంది తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్టు కలెక్టర్ అన్నారు. ఇట్టి సర్వే అత్యంత త్వరితగతిన పూర్తిచేయుటకు తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికి ప్రభుత్వాదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. తొలగింపబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులు, వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి, సర్వేకు సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# మట్టి పాత్రల వాడకం ఆరోగ్యానికి మేలు

**జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి**



**మహాదేవపూర్ ఫిబ్రవరి 27, (నినాదం):** మట్టి పాత్రల వాడకం ఆరోగ్యానికి ఎంతో మేలు అని జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి అన్నారు. నేషనల్ గ్రీన్ కార్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లాస్థాయి జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మట్టి కుండల తయారీ వర్క్ షాప్ ను ప్రారంభించారు. మట్టి కుండల తయారీ విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైనటువంటి మట్టి పాత్రలు వాడాలని అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. దానివల్ల నిరాదరణకు గురవుతున్న ఏకో ఫ్రెండ్లీ చేతివృత్తులను బలోపేతం చేసే విధంగా మేలు చేసిన వారమవుతామని తెలిపారు. బాలుర పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు బయోసైన్స్ జిల్లా పురం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనా భాను, ఉప సర్పంచ్ శ్రీజ, బాలికల పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సరిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళ్యాణి, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ తో పాటు పలు పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు, కుమ్మరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



మహాదేవపూర్ ఫిబ్రవరి 27, (నినాదం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లిలో 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి, ఉప సర్పంచ్ యశోద రవి మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు చొరవ తో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్ర, వాడు సభ్యులు రాజయ్య, మౌనిక, మధుకర్, సమ్మయ్య, నాగేందర్, శశికాంత్, మాధవి తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న బంగారాన్ని 24 గంటల్లోనే రికవరీ చేశాం



**మిర్యాలగూడ ఫిబ్రవరి 27 (నినాదం) :** పోగొట్టుకున్న బంగారాన్ని 24 గంటల్లో చేదించి బాధితురాలికి అప్పజెప్పినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు తెలిపారు. శుక్రవారం డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన కొమ్ము రాహుల్ కుమారి ఎస్బిఐ బ్యాంకులో తన యొక్క బంగారు వస్తువులను భద్రపరచుకోవడానికి వెళ్లి కొంచెం సేపు బ్యాంకులో ఉండి నీళ్లు త్రాగటానికి వెళ్లి వచ్చేసరికి ఆమె బ్యాగ్ లో ఉన్న బంగారు వస్తువుల కవర్ కనిపించడం లేదని అదే రోజు రాత్రి నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు బ్యాంకు సిసి ఫుటేజ్ ఆధారంగా పైలాన్ కాలనీకి చెందిన మహిళ ను కవర్ తీసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఆమె దగ్గర నుండి బంగారు వస్తువుల కవర్ను 24 గంటల్లో కేసు చేదించి ఆమెకు అప్పగించారు. ఇట్టి కేసును ఛాలెంజ్ గా తీసుకొని రికార్డు చేసినందుకు సిఐ శ్రీను నాయక్ ఎస్సై ముత్తయ్య పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# శంకర్ కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటాం

**నల్గొండ ప్రెస్ మీట్ ఫిబ్రవరి 27 (నినాదం ):**
పానగల్ 2వ డివిజన్ కు చెందినదీ=గా పార్టీ కార్యకర్త పాక శంకర్... వ్యవసాయ భూమిలో గల ట్రాన్సఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తో మరణించడం తో.... నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి వారి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.. కుటుంబ సభ్యుల ను పరామర్శించి తమ సానుభూతిని తెలియచేసారు.. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెపియచేసారు.. స్థానిక కార్పొరేటర్ పెఠిక యాదయ్య సిపిఎం నాయకులు హషం, తగుళ్ల ప్రదీప్, శాగటి రాములు వెంకన్న తదితరులు వెంట ఉన్నారు.

# ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు (అబా కార్డు) పంపిణీ

**-సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి**



**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 27( నినాదం):**
జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామం లో శుక్రవారం హెల్త్ కార్డు లు సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు హెల్త్ కార్డులు పొందాలని ప్రతి పేదవారికి ఈ కార్డు ఎంతో మేలు కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్, వార్డ్ మెంబెర్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



**అమరచింత, ఫిబ్రవరి 27, (నినాదం) :** స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలను శుక్రవారం అమరచింత మండలంలోని తుక్య నాయక్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనిల్ రెడ్డి బ్లాక్ బోర్డ్ పై చంద్రశేఖర్ చిత్రపటాన్ని గీసి విద్యార్థులకు చూపించారు. అనంతరం ఆజాద్ చంద్రశేఖర్ కు ఘన నివాళులర్పించి ఆయన పోరాట పటిమ గురించి విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అప్పగించిన ఎస్సై



**మహాదేవపూర్ ఫిబ్రవరి 27, (నినాదం) :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు ఎస్సై పవన్ కుమార్ అప్పగించారు. మండలంలోని బొమ్మపూర్ కు చెందిన బండం సుశీల, మహదేవపూర్ కు చెందిన దొబ్బేట మహేష్, కాటారంకు చెందిన చింత రంజిత్ ల ఫోన్లు పోగా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వాటిని సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పున్నంతోపాటు పలువురు పాల్గొన్నారు. మొబైల్ ఫోన్లను అందించిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శివ సాయి వాషింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కౌన్సిలర్

**మునుగోడు, ఫిబ్రవరి 7 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా.చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని, శ్రీ బాలాజీ దేవస్థానం పక్కన ఏనుగుల లక్ష్మణ్ నూతనంగా శివ సాయి వాషింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ పాల్గొని, తన చేతుల మీదగా శివ సాయి వాషింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమాని ఏనుగుల లక్ష్మణ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

శనివారం, తెలంగాణ
28 ఫిబ్రవరి 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## రెవెన్యూ శాఖను భ్రష్టు పట్టించింది కెసిఆర్ ప్రభుత్వమే

**సిద్దిపేట ఫిబ్రవరి 27 (నినాదం):** బీఆర్ఎస్ పాలనలోనే రెవెన్యూ వ్యవస్థలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే హరీష్ రావు ఏనాడు తహశీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేయలేదని,అన్నారు. సాదా బైనామా దరఖాస్తులు బీఆర్ఎస్ పాలనలోనే పెండింగ్ లో ఉన్నాయన్నారు. ధరణీ పేరుతో కెసిఆర్ కుటుంబం , బీఆర్ఎస్ నేతలు పేదల భూములు లాక్కొని ,కోట్ల రూపాయల అవినీతి చేశారన్నారు .కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి అక్రమాలను సరి చేసి భూభారతిగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తుందన్నారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులూ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ మాజీ కార్యదర్శి కల్లూరి నర్సింలు ,నాయకులూ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి మహేందర్ రెడ్డి ,కోరిమి రాజు ,ఒగ్గు కిసాన్,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## విఠలేశ్వర, రుక్మిణి దేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్ నగర్, షాపూర్ నగర్ ప్రాంతాలలో నిర్వహించిన శ్రీ విఠలేశ్వర, రుక్మిణి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో బిజెపి నాయకులు గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక దత్తాత్రేయ యంత్ర విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగదిరిగుట్ట పరిధిలో శ్రీ సోమవంశ సహస్రార్జున మహారాజ్, వినాయక, దత్తాత్రేయ యంత్ర విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో బిజెపి నాయకులు, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయి నాథ్ నేత తదితర నాయకులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్--15వ వార్డులో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నిర్వహించిన విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ప్రాంతీయ ప్రజల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ వేడుకల్లో మాజీ మంత్రి



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని 26 వ వార్డుకు చెందిన శివరామ్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

### పట్టు రైతులకు, ప్రజా ప్రతినిధులకు తెలియకుండా

# దసలీ పట్టు సమ్మేళనం.?

**అధికారులను నిలదీసిన సర్పంచ్ హసీనా బాను**

**మహాదేవపూర్ ఫిబ్రవరి 27, (నినాదం):** పట్టు పంట పండించే గిరిజన రైతులకు,స్థానిక ప్రజాప్రతినిధులకు,నాయకులకు సమాచారం అందించకుండా దసలీ పట్టు పరిశ్రమ శాఖా ఆధ్వర్యంలో పట్టు రైతుల సమ్మేళనం నిర్వహించడం పై పట్టు పంట పండించే గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని దసలీ పట్టు శాఖా కార్యాలయంలో పట్టు పరిశ్రమ శాఖా ఆధ్వర్యంలో నిర్వహించిన దసలీ పట్టు రైతుల సమ్మేళనానికి గిరిజన రైతులను ఆహ్వానించకపోవడంతో పాటు తమ గ్రామ రైతుల అభివృద్ధికి తోడ్పాటునందించేందుకు నిర్వహించే కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించక పోవడంపై గ్రామ సర్పంచ్ హసీనా బాను పట్టు పరిశ్రమ శాఖ అధికారులను నిలదీశారు.తమ గ్రామ రైతుల తోడ్పాటునందించే బాధ్యత తమపై ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తమకు ఎలాంటి ఆహ్వానం లేదు**

పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమ్మేళనానికి తమకు ఎలాంటి ఆహ్వానం అందలేదని గిరిజన సంఘం నాయకుడు కాల్నేని రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదు దశాబ్దాలుగా మహాదేవపూర్ మండలంలో మహాదేవపూర్ కేంద్రంగా పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసలి పట్టు పురుగుల పెంపకం పై ఆధారపడి దాదాపు వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని



రాములు అన్నారు. ఏటా తీసే పంటలో భాగంగా వర్షాకాలం పంటకు మూడు రూపాయల 50 పైసలు ఇస్తామని చెప్పిన పట్టు పరిశ్రమ అధికారులు మూడు రూపాయలు మాత్రమే ఇచ్చారని రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పట్టు పరిశ్రమ శాఖ జెడినీ అడిగామని వర్షాకాల పంటకు సంబంధించిన పూర్తి డబ్బులు వచ్చాయని అన్నారు.కానీ స్థానిక అధికారులు రైతులకు వచ్చిన డబ్బులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తూ రాలేదని సమాధానం ఇస్తున్నారని వాపోయాడు . వర్షాకాల పంటకు సంబంధించిన మిగిలిన డబ్బులు కాటారం సబ్ డివిజన్ లోని గూడూరు, వీరాపూర్, మహాదేవపూర్ రైతులకు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉంటే స్థానికంగా పెంచిన పట్టుపురుగుల నుండి వస్త్రాలు తయారీ కార్మికులు ఇతర వస్తువులను ఉపయోగించి వస్త్రాలు తయారు చేస్తున్నారని, పూర్తిస్థాయిలో



పట్టుపురుగుల ద్వారా వచ్చే దారం ఉపయోగించి వస్త్రాలు వేయడం ద్వారా పట్టుపురుగుల పెంపకం పై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు న్యాయం జరుగుతుందని అన్నారు.దసలీ కాయల కొనుగోలులో అవకతవకలు చేస్తూ వస్త్ర తయారీదారులు పాట పాడి తీసుకునేలా అధికారులు వ్యవహరించపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు.అలాగే అధికారులు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పట్టు రైతులను నష్టాలపాలు చేస్తున్నారని అన్నారు. రైతులకు అందాల్సిన ప్రభుత్వ ఫలాలను అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇదిలా ఉంటే రైతులకు అవగాహన కల్పించడానికి నిర్వహించిన పట్టు రైతుల సమ్మేళనానికి రైతులను ఆహ్వానించకుండా నిర్వహించడంలో ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలని పట్టు రైతులు వాపోయాతున్నారు.

## మాట ఇచ్చాం.. బస్సు తెచ్చాం

- నానాజీపూర్ గ్రామ బస్సు సర్వీస్ డ్రైవర్‌ను సన్మానిస్తున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (నినాదం):** రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ గ్రామనికి బస్సు సర్వీస్ ను ప్రారంభించిన బిజెపి రాజేంద్రనగర్ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి. శుక్రవారం గ్రామ సర్పంచ్ సురేష్ రాజు ఉపసర్పంచ్ విజయకుమార్ వంగ మహేందర్ రెడ్డి మునుగుల రాజిరెడ్డిలతో కలిసి నూకల శ్రీనివాస్ రెడ్డి బస్సు సర్వీసును ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ముఖ్యంగా విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని తెలియజేయడంతో మొన్న జరిగిన సర్పంచ్ ఎలక్షన్లో బిజెపి పార్టీ అభ్యర్థి తరపున మాట్లాడుతూ ప్రచారంలో గెలిచినా ఓడిన గ్రామానికి బస్సు సర్వీసు తెప్పిస్తానని మాట ఇవ్వడం జరిగింది అన్నమాట ప్రకారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి టీజీఎస్ఆర్టిసి ఉన్నత అధికారులతో పలుమార్లు చర్చించి బస్సు సర్వీసును గ్రామానికి తెప్పించడం జరిగిందన్నారు. ఎన్నో రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు విద్యార్థులు యువకులు



హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించడం జరిగింది . ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారం ఎంతగానో ఉందని వారికీ మన అందరి తరుపున కృతజతలు తెలియజేశారు. గ్రామాలలో అభివృద్ధి బిజెపి పార్టీతోనే సాధ్యమవుతుందని మరొకసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్-రాజు , ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వంగ మహేందర్ రెడ్డి మునుగుల రాజిరెడ్డి ,వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు, మైలారం రాధికా-శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి గారు,సిద్దేశ్వర్ గౌడ్, సంతోష్ కుమార్, వెంకటేష్ గౌడ్,మైలారం దర్శన్, మైలారం కృష్ణ, శ్రీనివాస్ గౌడ్ మరో స్థానిక యువకులు బస్తీ వాస్తవ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమాజంలో పెడధోరణి వల్లే..

## న్యాయవాదులకు రక్షణ కరువైంది





- న్యాయవాదుల రిలే దీక్షలకు మద్దతు ఇచ్చిన మాజీ మంత్రి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నినాదం) :** సమాజంలో పేడ ధోరణి వల్ల న్యాయవాదులకు రక్షణ కరువైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో గత నాలుగు రోజులుగా న్యాయవాదులు తమ రక్షణ కోసం చట్టం కావాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెడధోరణుల వల్ల న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని, వారి రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఎటువంటి కేసునైనా నేను వాదించను అనే హక్కు న్యాయవాదికి లేదని, కక్షిధారునికి న్యాయం చేయడమే న్యాయవాది వృత్తి ధర్మమని, అంతమాత్రాన కక్ష్య పెంచుకొని దాడులు చేయడం అవివేకమని ఆయన పేర్కొన్నారు. సమాజ నడవడిక ఎట్లా ఉన్నా యువ న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదుల సలహాలతో న్యాయాన్ని నిలబెట్టాలని అన్నారు. వృత్తిలో ఈర్ష్య దేశాలు వదలి తమ ప్రవీణ్యతతో మంచి పేరు తెచ్చుకోవాలని, న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుందని నిరంజన్ రెడ్డి అన్నారు

## జోషి పెళ్లి వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నినాదం) :** కొత్తకోట మండలం మదనాపురం గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఉపాసకులు బ్రహ్మశ్రీ జోషి వేణుగోపాల స్వామి (గోపి స్వామి) గురుస్వామి కుమారుడు జోషి సాయి, శ్రీకరి వివాహ రిసెప్షన్ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వెంట మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మాజీ సిడిసి చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, రామకృష్ణాపురం యుగంధర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ యాదగిరి, పెట్రోల్ పంప్ కలకొండ రజిత్ పాల్గొన్నారు



### మానసికోలాసం శారీరక దృఢత్వానికి

## క్రీడలు ఎంతో దోహదం

**లోర్వేన్ బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి**





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం గ్రామ వాసులు రవిష్, రాహుల్, సుభాష్ లు నూతనంగా ఏర్పాటు చేసిన లోర్వేన్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి





**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డులో హైందవ రెడ్డి, నీహారిక రెడ్డి ల ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన హైందవ న్యూరో చెస్ట్ హాస్పిటల్ ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

శనివారం
28 ఫిబ్రవరి
2026


# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమే నా...!

**భూదాన్ అక్రమార్కుల నిగ్గు తేల్చాలి**

**కమ్యూనిస్టుల చరిత్ర యూట్యూబ్ వెబ్ పెయిడ్ బ్యాచ్ కి ఏం తెలుసు**

**వామపక్షాల పోరాట ఫలితంగానే ఖమ్మంలో కాలనీ ల ఏర్పాటు!**

**నిర్వాసితులకు తక్షణ సహాయం కింద రూ లక్ష రూపాయలుప్రకటించాలి**

**విలేకర్ల సమావేశంలో వామపక్షపార్టీల నేతలు**



**ఖమ్మం,ఫిబ్రవరి27(నినాదం ):** ఇందిరమ్మ రాజ్యం అంటే కూలీ పనులు చేసుకుంటూ గూడు ఏర్పరుచుకున్న నిరుపేదల ఇళ్లను కూల్చి వారిని మెడ పట్టి గెంటి టివేయడమే ఇందిరమ్మ రాజ్యమా అని పలువురు వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు..ఇళ్ళ కూల్చి వేత సందర్భంగా ఎటువంటి నోటీసులు లేకుండా వారి సామాన్లు కూడా తీసుకోనివ్వకుండా 2వేల మంది పోలీసులను,వందలాది మంది అధికారులను ఏర్పాటు చేసి తెల్లవారు జామునుంచే కూల్చి వేయడం గాజ్రాయిల్ పై ఇజ్రాయిల్ చేసిన దమన కాండను గుర్తు చేసిందన్నారు.ఖమ్మం నగరంలోని సిపిఐ ఎం ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు .ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో గల భూదాన్ భూముల్లో గత 10 సంవత్సరాల క్రితం నుంచి నిరు పేదలు పట్టాలు పొంది 600మంది నివసిస్తు న్నారని తెలిపారు.వారి అందరి ఇళ్లు కూల్చి వేయడం వల్ల వారు రోడ్డున పడ్డారని,విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను కూడా రాయ లేదన్నారు.2014నుంచి బడా బాబుల భూములను క్రమ బద్ధీకరణ చేస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్లను ఎందుకు క్రమ బద్దీ కరించడం లేదని ధ్వజమెత్తారు.

ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయనే అక్కడ వున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు.మొత్తం 62 ఎకరాలలోని 32 ఎకరాలలో ఇళ్ళ ను కూల్చి 250 కోట్ల ఆస్తిని స్వాదీనం చేసుకొన్నామని గొప్పలు చెప్పుకుంటున్న వారు మిగతా స్థలం ఏమైనదో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.నిరు పేదలు ఆక్రమణ దారులు కాదని,కూలీ పనులు చేసుకుని అప్పులు తెచ్చుకొని ఇళ్లు నిర్మించుకునే వారన్నారు.అటువంటి వారి ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడమని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు.జిల్లా కలెక్టర్ ప్రజల అధికారా లేక రియల్ ఎస్టేట్ వ్యాపార అని ప్రశ్నించారు.

ఆయన సంఘటన పై చెప్పిన వివరాల ను పరిశీలిస్తే ఆ భూమి నీ ప్రభుత్వం బడా బాబులకు కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు.జిల్లా యంత్రాంగం నిష్పక్ష పాతంగా వ్యవహరించి నిర్వాసితులకు న్యాయం చేయాలని ,ప్రభుత్వ నిర్వాహకం వల్ల నిర్వాసితులు సర్వస్వం కోల్పోయి తినడానికి తిండి కూడా దొరకక అల్లాడుతున్నారని,వారికి తక్షణ సాయం గా లక్షరూపాయలు అందించాలని, ఇళ్లు కోల్పోయిన ప్రతీ ఒక్కరికీ అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లికమ్యూనిస్టుల చరిత్ర పిల్లకాకులకు ఎం తెలుసులి

తెలంగాణ సాయుధ పోరాటం లాంటి,ముదిగొండ భూపోరాటం వంటి మహత్తర పోరాటాల ద్వారా పేదలకు ఇళ్లు, స్థలాలు,భూములు సాధించినటువంటి కమ్యూనిస్టు పార్టీల చరిత్ర యూ ట్యూబ్ వెబ్ పెయిడ్ బ్యాచ్ కు ఏం తెలుస్తుందని వామ పక్షనేతలు మండి పడ్డారు.వామ పక్షాల పోరాటాలు లేకుండా వాళ్ళు మరణించకుండా,దెబ్బలు తినకుండా,నిర్బంధింప పడకుండా ఖమ్మం నగరంలో నీ పేదలు నివసించే రామనగుట్ట,దానవాయిగూడెం,రామన్నపేట,అగ్రహారం,దంస లాపురం, వై ఎస్ ఆర్ కాలనీ వంటి కాలనీలు ఏర్పడ లేదని తెలిపారు.ఇందిరమ్మ పథకం కూడా తమ పోరాటాల వల్లనే వచ్చిందన్నారు.అటువంటి వామపక్ష పార్టీలపై యూట్యూబ్ వెబ్ ఛానల్ ఎల్లో జర్నలిస్టులు కొంత మంది కారుకూతలు తమ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.చరిత్ర తెలియక పోతే తెలుసుకొని ప్రచారం చేయాలని,అంతేకాని ప్యాకేజీ లు తీసుకొని జర్నలిజం విలువలు దిగజార్చ వద్దన్నారు.లేనియెడల ప్రజలే తగిన గుణపాఠం జేబుతారన్నారు.

లిఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనాలి

పేదప్రజల ఇళ్లు నిర్మించి ఇస్తాం..మాది ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రభాల్గాలు పలికే జిల్లా మంత్రులు సంఘటన పై ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రులు నిర్వాసితుల పక్షాన నిలిచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అప్పటి వరకు వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా,ఎటువంటి చర్యలు తీసుకున్నా నిర్వాసితులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఈ విలేకర్ల సమావేశంలో ఆయా పార్టీల రాష్ట్ర,జిల్లా,నగర నాయకులు వై.విక్రం,మేకల శ్రీనివాస్,ఆవుల అశోక్ ,పాముల మోహన్, రాజు,జి.మస్తాన్,శంకర్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# లక్కిడ్రాలో ఎలక్ట్రీకల్ బైక్ స్వంతం చేసుకున్న గుండెంగవాసీ



**గూడూరు ఫిబ్రవరి 27 ( నినాదం) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో జీకే మోటర్స్ ఎలక్ట్రీకల్ బైక్ షోరూమ్ వారు నిర్వహించినరూ 299 లకే లక్కి డ్రాలో ఎలక్ట్రీకల్ బైక్ ను గుండెంగ కు చెందిన గుగులోత్ వినోద్ గెలుపొందారు. గూడూరు మండల కేంద్రంలో జీకే మోటర్స్ ఎలక్ట్రీకల్ బైక్ షోరూమ్ వారు రూ299లకే 299 సభ్యులతో మొదటి ప్రైజ్ ఎలక్ట్రికల్ బైక్ , రెండవ బహుమతి ఎల్ ఈడీ టీవీ లక్కి డ్రా నిర్వహించారు. గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సునిత-కొమ్మాలు నాయక్ స్వయంగా డ్రా టోకెన్లు తీశారు సుమారు రెండు గంటల పాటు టోకెన్లు తీయడం కూపన్ దారులలో తీవ్ర ఉత్కంత నెలకొంది. చివరి క్షణంలో గుండెంగ కు చెందిన గుగులోత్ శ్రీహిత తండ్రి వినోద్ బైక్ ను స్వంతం చేసుకున్నాడు. అలాగే రెండవ ప్రైజ్ ఎల్ ఈడీ టీవీ ని ధర్మరావుపేటకు చెందిన శెట్టి కుమార్ గెలుపొందారు. ఈకార్యక్రమంలో జీకే మోటర్స్ ఎలక్ట్రీకల్ బైక్ షోరూమ్ యాజమాన్యం గుగులోత్ కిషన్ ,బి.మల్లేష్ , మర్రిమిట్ట సర్పంచ్ భానోత్ పూర్ణచందర్ , దొడ్డా శ్రీను , భానోత్ భాస్కర్ , ముంజాల సదానందం ,బుచ్చిరాములు ,శాంతిక్రిష్ణ , యాకుబ్ పాష , పల్సారమేష్ , భూక్య రమేష్ ,పల్సా రమేష్ ,ప్రసాద్ , పులిగిల్ల శ్రీశైలం ,పలువురు ప్రజాప్రతినిధులు ,మాజీ సర్పంచ్ లు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన కేంద్ర అధికారులు

**కార్యక్రంలో పాల్గొన్న డీఈవో బిక్షపతి, ఎంఈవో మల్లికార్జున రావు, ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి**



**మునుగోడు, ఫిబ్రవరి 27 (నినాదం) :** పీఎం శ్రీ పాఠశాలల తనిఖీలో భాగంగా, మునుగోడు నియోజకవర్గం, నాంపల్లి మండలంలోని. పెద్దాపురం ఆదర్శ పాఠశాలను కేంద్ర సాంస్కృతిక శాఖ కమిషనర్ కమలేష్ కుమార్ మిశ్రా బృందం తనిఖీ నిర్వహించారు. అధికారులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.తనిఖీ లో భాగంగా కంప్యూటర్ ల్యాబ్, ఐ ఎఫ్ పీ ప్యానెల్ బోర్డ్ విధానం అటల్ ల్యాబ్ , కెమిస్ట్రీ , జూయాలజీ ల్యాబ్ లను, హౌస్ సిస్టమ్, స్కాట్స్ అండ్ గైడ్స్, స్పోర్ట్స్ రూమ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కెరీర్ గైడెన్స్ సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం వంటి మొదలగు కార్యక్రమాల నిర్వహణను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్నం భోజనం పథకం గురించి విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కంప్యూటర్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ,కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలలో ఉపయోగించే అన్ని రిజిస్టర్ల గురించి ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, పాఠశాల ఉపాధ్యాయులు పనితీరు పై కేంద్ర అధికారుల బృందం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో, ఆర్ జే డీ సోమిరెడ్డి, డీఈవో బిక్షపతి, సీఈవో శ్రీనివాస రావు, ఎమ్మార్వో దేవ్ సింగ్, జీ సీ డీ వో అరుంధతి, ఎంఈవో మల్లికార్జున రావు, ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 10వ బెటాలియన్‌లో ఘనంగా ప్రారంభోత్సవాలు

**ముఖ్య అతిథిగా అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ హాజరు**





**గద్వాల జిల్లా వార్తలు ఫిబ్రవరి 27( నినాదం) :** జోగుళాంబ గద్వాల్ జిల్లాలోని 10వ బెటాలియన్‌లో నిర్వహించిన పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు లిసంజయ్ కుమార్ జైన్, ఐపీఎస్.,లి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, బెటాలియన్స్, హైదరాబాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా 10వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ శ్రీ ఎం. జయరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., పూల మొక్క అందజేసి అతిథిని ఆహ్వానించారు. తదుపరి 10వ బెటాలియన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అదనపు డీజీపీ ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన సాయిధ కన్వెన్షన్ హాల్‌ను ఘనంగా ప్రారంభించారు. అనంతరం సాయుధ చైతన్య స్కూల్‌లో వేదికపై కొత్తగా నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును కూడా ప్రారంభించారు. తరువాత బెటాలియన్ పరిధిలో త్వరలో నిర్మించబోయే 30 షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ నిర్వహించారు. స్కూల్ ఆవరణలో అదనపు డీజీపీ , జిల్లా ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బందితో సమావేశమై, సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబ సభ్యుల సౌకర్యాలు మరియు బెటాలియన్ సమగ్ర అభివృద్ధికి ఈ సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఇన్‌చార్జ్ కమాండెంట్ శ్రీ ఎం. జయరాజుకి సూచించారు. సాయిధ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీజీపీ తన ప్రసంగంలో జడ్చర్ల గొల్లపల్లి చెరువులో మృతదేహాలను వెలికితీసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర స్థానిక మరియు మున్సిపల్ ఎన్నికలు, గోవా రాష్ట్రంలో జరిగిన పరేడ్, బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని ప్రశంసించారు. అలాగే 10వ బెటాలియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్ రెడ్డి గారు మరియు పాణి కి ఉత్తమ సేవ పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, బెటాలియన్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సిబ్బందికి ఉత్తమ వాతావరణాన్ని కల్పించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉత్తేజాన్ని అందిస్తాయని తెలిపారు. ఇలాంటి సదుపాయాలు పోలీసు సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ కమాండెంట్ శ్రీ ఎం. జయరాజు, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఇటిక్యాల ఎస్సై రవి, బెటాలియన్ అధికారులు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నరసింహారాజు, ఆర్పి సింగ్, ధర్మారావు, రాజేశం, రాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**



**నల్గొండ ప్రతినిధి ఫిబ్రవరి 27 (నినాదం ) :** వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా చేపట్టిన పనులలో పురోగతి తీసుకురావాలన్నారు. రానున్న వేసవిలో మనుషులు, పశువులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకుండా మందస్తు కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని ,స్వచ్ఛంధ సంస్థల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాల తనిఖీ నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలని చెప్పారు.ప్రభుత్వ ప్రాధామ్య పథకాలకు సంబంధించిన నివేదికలు అప్డేట్ గా ఉండేలా చూసుకోవాలని అన్నారు.కార్యాలయ పనులలో సమయం వృధా కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగించాలని, ఇందుకుగాను జిల్లా అధికారులందరూ కంప్యూటర్ వినియోగం పై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్లు, తహసిల్ ఆఫీసులు, ఎంపీడీవో కార్యాలయాలు, సంక్షేమ శాఖలు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగించుకునేలా చూడాలని, తద్వారా ఉచిత సేవలతోపాటు, పనులు సులభం అయ్యే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

## కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి వీల్‌చైర్లు బహుకరణ



**కోదాడ, ఫిబ్రవరి 27 (నినాదం):** కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మఠంపల్లి వివేకవర్ధని పాఠశాల 1996 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. గెట్-టుగెదర్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆసుపత్రికి రెండు వీల్‌చైర్లు మరియు స్ట్రక్చర్‌ను బహుకరించారు.శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ దశరథకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ దశరథ మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు వీల్‌చైర్లు ఎంతో ఉపయోగపడతాయని, పూర్వ విద్యార్థుల సేవాభావం అభినందనీయమని తెలిపారు .డాక్టర్ నరసింహ మాట్లాడుతూ సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావనతో ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పూర్వ విద్యార్థులు పల్లె బాబు, రూబెన్, చలమారెడ్డి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ పీఎం శ్రీ పాఠశాలలో**

# సాంప్రదాయ నృత్యాల సందడి

**కోదాడ, ఫిబ్రవరి 27 ( నినాదం) :** కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యం లో కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జెడ్పీజీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేరళ రాష్ట్రం నుండి వచ్చిన ఉన్నత స్థాయి సాంస్కృతిక సంగీత అధికారుల బృందం హాజరై, భారతీయ సాంప్రదాయ నృత్య కళలను పరిచయం చేశారు.

కళాకారులు మోహినీయాట్టం , భరతనాట్యం నృత్యాలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించి, వాటి ప్రత్యేకతలు, హావభావాలు, అడుగుల మెలుకువలను విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని నృత్యంలోని సాంప్రదాయ అంశాలను నేర్చుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీలబాయి తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



# న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**అడ్వకేట్ చిందం కృష్ణయ్య**






**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 (నినాదం) :** న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీనియర్ న్యాయవాది చిందం కృష్ణయ్య అన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పించాలని గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి.ఈ నిరసనలో భాగంగా శుక్రవారం 4 వ రోజు కల్వకుర్తి కోర్టు ఆవరణలో న్యాయవాదులు వంశీకృష్ణ ,చిందం కేదార్నాథ్, కే నరేష్ ,బి నరేందర్ లు రిలే నిరాహార దీక్షలో కూర్చొని నిరసన తెలిపారు.ఈ రిలే దీక్ష కు సీనియర్ న్యాయవాదులు చిందం కృష్ణయ్య, జై లక్ష్మినారాయణ,గుండె వెంకట్ గౌడ్, మల్లెపల్లి జగన్, వెంకటేష్ లు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని కల్పించాలని గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 కోర్టులలో న్యాయవాదులం విధులను బహిష్కరించి రిలే దీక్షలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. న్యాయం లభించని సామాన్య ప్రజలకు న్యాయవాదుల ద్వారా కోర్టులో ఉపశమనం పొందే మార్గం ఉంది. సామాన్యులకు న్యాయం చేసే న్యాయవాదులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీక్షలో కూర్చున్న వారికి సీనియర్ న్యాయవాది వి. వెంకట్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. దీక్షలను ప్రారంభించిన అనంతరం పాదయాత్ర చేస్తున్న అలంపూర్ న్యాయవాదులకు మద్దతుగా సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా హైదరాబాద్ కు తరలిన కల్వకుర్తి న్యాయవాదులు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ సంగమం.. అర్ధ శతాబ్దం తర్వాత కలయిక

**పాత తరగతి గది జ్ఞాపకాలతో మళ్లీ ఒకటైన మిత్రబృందం**




**కోదాడ, ఫిబ్రవరి 27(నినాదం):** కె ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో 1974బ76 విద్యా సంవత్సరంలో సి ఈ సి గురుకుల చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం కోదాడ పట్టణంలో సమ్మేళనమయ్యారు.. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.. అనంతరం అధ్యాపకులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, మంత్రి ప్రగడ భారత రావు, సిహెచ్ ప్రభాత్ కుమార్ చౌదరి మాట్లాడుతూ మానవ రక్త సంబంధాలు కనుమరుగుతున్న నేటి సమాజంలో 50 ఏళ్ళ క్రితం తమ వద్ద చదువుకున్న విద్యార్థులు తిరిగి కలుసుకోవడం అభినందనీయమన్నారు ... వివిధ ప్రాంతాలలో తమ జీవితాలలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని మనవలు మనవరాళ్లతో గడుపుతున్న పూర్వ విద్యార్థులు తమను గుర్తు పెట్టుకొని సత్కరించటం మరిచిపోలేని సంఘటనని పేర్కొన్నారు.. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకోవడంతో పాటు కుటుంబ వివరాలను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.. చదువుకునే రోజులలో జరిగిన సంఘటనలను నెమరు వేసుకున్నారు. ఈ వేడుకలో ఆంగ్లో ఉపన్యాసకురాలు మేరీ కుట్టి జోసెఫ్ పూర్వ విద్యార్థులు కేసన్ ప్రసాద్ చెన్నకేశవరావు వెంకటాద్రి ప్రభాకర్ కృష్ణారెడ్డి బిక్షం బోధ నేతర సిబ్బంది అల్లా బిక్షం బహదూర్ నారాయణలు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

శనివారం
28 ఫిబ్రవరి
2026


# గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యే జారె

**మహిళా సాధికారత విద్యా ప్రమాణాల**

**మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత**





**దమ్మపేట, ఫిబ్రవరి 27(నినాదం):** దమ్మపేట మండలంలో స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి మహిళా సాధికారత విద్యా వసతుల మెరుగుదల ప్రధాన లక్ష్యంతో మండల పరిధిలో పూసుకుంట గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘ మహిళల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి జీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ క్రమంలో ఆర్లపెంట గ్రామంలో మహిళా సంఘాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. పట్వారిగూడెం పంచాయతీ సుధాపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. రాచూరుపల్లి పంచాయతీ పాత లచ్చాపురం గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ దిశలోనే జమేదార్ బంజర పంచాయతీ గుర్వాయిగూడెం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని అర్బన్ కాలనీ నందు అంగన్వాడి నూతన భవనాన్ని ప్రారంభించి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిదంగా ముష్టిబండ పంచాయతీ అప్పారావుపేట గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వడ్లగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మారప్ప గూడెం గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే పంచాయతీ పరిధిలోని చీపురుగూడెం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అంకంపాలెం గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో
# ఐఓసిఎల్ కంపెనీ డ్రైవర్లకు కంటి పరీక్ష

**చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్**



మునుగోడు, ఫిబ్రవరి 27 (నినాదం): అరైవ్, అలైవ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పోలీస్ ల రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగం, మునుగోడు నియోజకవర్గ. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం. మల్కాపురం ఐ ఓ సి ఎల్ కంపెనీ లో ఉన్న డ్రైవర్ లందరికీ కంటి పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్ హాజరయ్యారు. రోడ్ సేఫ్టీ, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్ ల పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అలాగే కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ వాడాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని అతివేగం రాంగ్ రూట్ డ్రైవింగ్ మరియు డ్రైవింగ్ చేస్తూ, సెల్ ఫోన్ మాట్లాడడం ప్రమాదకరమని, ఆ అలవాట్లు మానుకోవాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాద రైత సమాజాన్ని నిర్మించాలని, తెలంగాణ ప్రభుత్వం మరియు తెలంగాణ పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం, ఐ ఓ సి ఎల్ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి, ఐ ఓ సి ఎల్ అధికారులు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**మొయినాబాద్ మున్సిపల్**

**పాలకవర్గానికి ఘనంగా సన్మానం**





**చేవెళ్ల ఫిబ్రవరి 27 (నినాదం):** పట్టణ గ్రామీణ ప్రాంతాలు కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ళ నియోజకవర్గం మొయినాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్, మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా, వైస్ చైర్మన్ రాజు, అన్ని పార్టీల కౌన్సిలర్స్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, డిసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీం భరత్ మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ లు పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాలు అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యమవుతుందని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయని, గత పదేళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి కొంటూ పడిందని, అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కూర్చున్న రెండు సంవత్సరాల, ఇల్లు లేని నిరుపేదలకు, ఇందిరమ్మ 500 వంట గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం రేషన్ కార్డు, సన్నం బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. నాటికి నేటికి పేదలకు అండ దండ కాంగ్రెస్ ప్రభుత్వమేనని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ కుమార్ యాదవ్ , మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య , షాబాద్ దర్శన్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి సత్య నారాయణ , చేవెళ్ళ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెంట రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మొయినాబాద్ మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**మూడవ రోజు 485 మంది గైర్హాజర్**

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నినాదం) :** ఇంటర్ పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా జరిగాయనీ జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ తెలియజేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగిందని తెలియజేశారు. మొత్తం 485 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర్ అయ్యారని తెలియజేశారు. మొత్తం 18,605 మంది విద్యార్థులకు గాను 18,120 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు. జనరల్ లో మొత్తం 15,936 మంది విద్యార్థులకు గాను 15,593 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ లో 2,669 మంది విద్యార్థులకు గాను 2,527 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 58 పరీక్షాల కేంద్రాలగ్నం 55 పరీక్ష కేంద్రాలను ఈరోజు జిల్లా ఇంటర్ విద్య కన్వీనర్ గా తనతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హై పవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు మొత్తం 54 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించామని తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ 9 జూనియర్ కళాశాల తనిఖీ చేసి పర్యవేక్షించారు.

# పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలి



**వ్యవసాయ అధికారి శంకర్ లాల్**

**చేవెళ్ల ఫిబ్రవరి 27 (నినాదం):** పంట సాగు చేసిన ప్రతి ఒక్క రైతు పంట సాగు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని చేవెళ్ళ వ్యవసాయ అధికార శంకర్ లాల్ అన్నారు.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేతో, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా క్రాప్ బుకింగ్ ఏవోల మీద పనిభారం తగ్గుతుందని దీంతో సర్వే చేయడానికి గ్రామాల వారిగా వాలంటీర్లను నియమించారు. శుక్రవారం చేవెళ్ల మండలంలో 36 రెవెన్యూ గ్రామాలండగా 27 గ్రామాల్లో వాలంటీర్లు సాగు వివరాలు నమోదు చేస్తారు. రెవెన్యూ మ్యాప్ లేని గ్రామాలు, భూముల సరిహద్దులు లేని చోట ఏఈఓ ను సర్వే చేపడతారు. 45 రోజుల్లోగా సర్వేనెంబర్ పూర్తి చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ అన్నారు. దేవుని ఎర్రవల్లి గ్రామంలో సర్వే తో పాటు కుసుమకు తీసుకోవలసిన ముఖ్య జాగ్రత్తలను రైతులతో చర్చించారు. ఆలస్యంగా కోత చేస్తే గింజలు రాలిపోతాయి దిగుబడి తగ్గుతుంది వర్షం పడే ముందు కోత పూర్తి చేయడం మంచిది .ముళ్ళు ఎక్కువగా ఉండటం వల్ల గ్లౌజు పూర్తి చేతికి బట్టలు ధరించండి, మొక్కలు పూర్తిగా ఎండిపోయి ఉండాలి, గింజలు గట్టిగా ఉండాలి నొక్కితే నీరు రాకూడదు గింజల తేమ శాతం 12 నుంచి 15% ఉండాలి అని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# తొలివెలుగు జర్నలిస్ట్ రఘుపై దమ్మపేట పోలీస్ స్టేషన్లో పిర్యాదు

**మంత్రి తుమ్మల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన**

**రఘు పై చర్యలు తీసుకోవాలి**

**దమ్మపేట తుమ్మల అభిమానులు కాంగ్రెస్**

**నాయకుల డిమాండ్..**




**దమ్మపేట, ఫిబ్రవరి 27(నినాదం):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబ్ తొలివెలుగు రఘు పై చర్యలు తీసుకోవాలని దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు తుమ్మల అభిమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత 40 సంవత్సరాలుగా ఎన్నో శాఖలకు మంత్రిగా పని చేసి మచ్చ లేని నిస్వార్థ నాయకుడిగా పని చేసిన ఆయన నేడు రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జీవితం తెరిచిన పుస్తకం వంటిదని, ఎప్పుడు అభివృద్ధి గురించి ఆలోచించే తుమ్మలపై రఘు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, అడపా రాంబాబు, యువనాయకులు కాసాని నాగప్రసాద్, ఎండి వలీ పాషా, యర్ర వసంతరావు, బొల్లికొండ ప్రభాకర్, కాంగ్రెస్ కార్యకర్తలు తుమ్మల అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుపై
# స్పందన.. రైస్ మిల్ సీజ్



**సిద్దిపేట,కొండపాక ఫిబ్రవరి27 (నినాదం):** కొండపాక మండలంలోని బందారం గ్రామంలో నివాస గృహాల మధ్య, పురాతన హనుమాన్ దేవాలయానికి ఆనుకొని రైస్ మిల్ వల్ల గ్రామంలో ధూళి, శబ్ద కాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా, దేవాలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. హనుమాన్ మాల దీక్ష సమయంలో భక్తులు దర్శనానికి వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేయగా, గతంలో తహసీల్దార్ మరియు రెవెన్యూ అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు.

**ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.**

దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు గ్రామంలో సర్వే నిర్వహించి, రైస్ మిల్‌కు ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించి శుక్రవారం మిల్లును సీజ్ చేశారు. ఈ చర్యపై బందారం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జోగ నరసయ్య స్మారక స్థూపం నిర్మాణానికి
# మండల ప్రజలు సహకరించండి.. సిపిఎం



**గుండాల, ఫిబ్రవరి 27 (నినాదం ):** సిపిఎం మండల కార్యదర్శి ఆదివాసి ముద్దుబిడ్డ అమరజీవి జోగ నరసయ్య స్మారక స్థూపం నిర్మాణానికి ఆర్థికంగా హార్దికంగా సహకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు, శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల ఊహించని రీతిలో జోగ నర్సయ్య మృతి చెందాడని అన్నారు.మారుమూల గుండాల మండలం తూరుబాక గ్రామంలో జన్మించిన జోగ నర్సయ్య విద్యార్థి దశనుండే విప్లవ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడని తెలిపారు,విద్యార్థి ఉద్యమంలో హాస్టల్ సమస్యలపై సైకిల్ యాత్ర నిర్వహించి విద్యార్థులను చైతన్య పరిచిన ఉద్యమ నేత 2007 సంవత్సరంలో సిపిఎం పార్టీ సభ్యత్వం తీసుకుని మండలంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలని ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు,జోగ నర్సయ్య అనతి కాలంలోనే జోగ నర్సన్న గా ప్రజల్లో గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన ఆశయాలు నెరవేర్చుడం కోసం గుండాల మండలంలో ప్రజా పోరాటాలు ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన స్మారక స్థూపం నిర్మాణానికి మండల ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తోలెం గోపి,దుగ్గి రామ్మూర్తి,పడుగోనిగూడెం ఉప సర్పంచ్ జోగ రాజేష్, కల్తీ శేఖర్,గడ్డం క్రిష్ణ,జోగ సారమ్మ,అరెం రామకృష్ణ,దుగ్గి అనిల్,దుగ్గి సత్యం,ఊకె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెర్కిట్ బస్టాండ్‌లో దుర్వాసనల మధ్య బెంబేలుతున్న ప్రయాణికులు

**చెడిపోయిన మూత్రశాలలు, మరుగుదొడ్లు...**

**చిత్తశుద్ధి లేని ఆర్టీసీ అధికారులు...**

**తాగుబోతులకు, దొంగలకు, యాచకులకు నిలయంగా**

**మారిన పెరికిట్ బస్టాండ్**



**ఆర్మూర్, ఫిబ్రవరి 27(నినాదం) :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గల పెర్కిట్ బస్టాండ్ పక్కనే గల మూత్రశాలలు, మరుగుదొడ్లు గత ఎనిమిది నెలల క్రితం చెడిపోయి, మూత్రశాలల, మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకులు సైతం శిథిలవస్థకు చేరి, మూత్రశాలల,మరుగుదొడ్ల నీరు బస్టాండ్ ప్రాంతంలో గల సీసీ రోడ్డు గుండా కరీంనగర్ వైపు వెళ్లే బిటి రోడ్డు గుండా వరకు వెళ్లడంతో, ప్రయాణికులు నడవలేని పరిస్థితి నెలకొనడమే కాకుండా, బస్టాండ్లో వాళ్ల ప్రయాణికులు దుర్వాసనల మధ్య ప్రయాణికులు కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో పత్రికలో కథనం ప్రచురించినప్పటికీ తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేయడంతో మళ్లీ యధా విధిస్థితికి చేరుకుంది. పెర్కిట్ బస్టాండ్ నుండి అనుకూలం గా ఉండడంతో ప్రయాణికులు పెర్కిట్ బస్టాండ్ నుండి నాగపూర్ వరకు, పెరికిట్ నుండి కరీంనగర్, వరంగల్ , హనుమకొండ, పెర్కిట్ బస్టాండ్ నుండి తదితర ప్రాంతాలకు నిత్యం ప్రయాణికులు వెళు తుంటారు. పెర్కిట్ బస్టాండ్ నిరంతరము ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. గతంలో బస్టాండ్ లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇదే పరిస్థితి నెలకొనగా తూతు మంత్రంగా మర మర మ్మతులు చేయించి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. గత ఎనిమిది నెలలుగా పెరికిట్ బస్టాండ్ లో మూత్రశాలలు మరుగుదొడ్లు, పూర్తిస్థాయిలో చెడిపోవడం, మురికి నీరు రోడ్ మీదికి రావడం తో ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన అధికారులలో చిత్తశుద్ధి లేకపోవడం, పర్యవేక్షణ సరిగా లేకపోవడం, వల్ల మూత్రశాలలకు మరుగుదొడ్లకు మోక్షం లభించేదన్నడు, అని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. ప్రధానమైన పెర్కిట్ బస్టాండ్ లో కంట్రోలర్ సైతం లేక, మూత్రశాలల, మరుగుదొడ్లకు వద్ద సరైన వ్యక్తులను నియమించకపోవడం వల్ల ప్రయాణికులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పెరికిట్ బస్టాండ్ లో దూర ప్రాంతాల నుండి వచ్చేవారు బస్సుల కోసం రాత్రి ఒంటిగంట వరకు వేచి ఉంటారు. కాగా అలాంటి పెరికిట్ బస్టాండ్ లో పోకిరి ల బెడద, యాచకులు, తాగుబోతులు బస్టాండ్ లోనే ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన బెంచీలపై తాగుబోతులు, యాచకులు, పోకిరీలు, దొంగలు సైతం పడుకోవడం వల్ల ప్రయాణికులు కూర్చుండ లేకపోతున్నారు. ఈ విషయం ఆర్టీసీ కంట్రోలర్ గా విధులు నిర్వర్తించిన గతంలో అధికారులకు, ప్రస్తుత పోలీస్ ఇంచార్జి అధికారికి సైతం ఈ విషయం విధితమే. రాత్రి ఆరు గంటలు దాటిందంటే బస్టాండ్ లో ప్రయాణికులు, మహిళా ప్రయాణికులు ఉండాలంటే దొంగల బెడదల వల్ల భయపడుతూ, నిర్మల్ వైపు వెళ్లే ప్రాంతంలో గల, కరీంనగర్ వెళ్లే ప్రాంతంలో గల ప్రయాణికులు నిలుచుండి ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతము వృద్ధులైన బస్టాండ్లో మూత్రశాలల వద్ద విధులు నిర్వహిస్తున్న వృద్ధుడు, ఒక వృద్ధ మహిళా సైతం బస్టాండ్ లో పోకిరిల వల్ల, మద్యం సేవకుల వల్ల, యాచకుల వల్ల, నానా ఇబ్బందులకు గురవుతూ విధులు నిర్వహిస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా పెర్కిట్ బస్టాండ్ లో శిధిల వద్దకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, మూత్రశాలల మరుగుదొడ్ల మురికినీరు వెళ్లే ట్యాంకులు సైతం శిధిల వద్దకు చేరి దుర్వాసన వెలువడుతున్న, అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం వెనుక ప్రయాణికుల పట్ల అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడమేనని పలువురు ప్రయాణికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆర్టిసి ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్టాండ్ లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, మురికి నీరు వెళ్లే ట్యాంకులను నూతనంగా నిర్మించి, ప్రయాణికులకు, మహిళల ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అంతేకాకుండా బస్టాండ్ లో తాగుబోతులు, యాచకులు, పోకిరీలు, దొంగల ను బస్టాండ్ ప్రాంతంలో ఉండకుండ, తాగుబోతులు,పోకిరీలు, దొంగలు సంచరించకుండా పూర్తిస్థాయిలో నైట్ డ్యూటీ చేసేలా ఏర్పాటు చేయాలని, రాత్రివేళ ఇతర ప్రాంతాలకు వెళ్ళలేని వారు పోలీసులు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి భయాందోళన లేకుండా బస్టాండ్ లో బస్సు వచ్చే వరకు ప్రయాణికులు సురక్షితంగా ఎలాంటి భయాందోళన లేకుండా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు, కోరుతున్నారు. బస్టాండ్ లో గల బోరు ఏర్పాటు చేసినప్పటికీ, ముందుగా మూత్రశాలలకు మరుగుదొడ్లకు నీరు పట్టుకోవాల్సి ఉండగా, అట్టి నీటిని రెండు హోటల్ యజమానులు ఉపయోగించుకోవడం వల్ల, మూత్రశాలలకు, మరుగుదొడ్లకు, నీటి కొరత తలెత్తుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఎండాకాలం కావడంతో బస్టాండ్ లో శాశ్వతంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. బస్టాండ్ లో కంట్రోలర్ ని ఏర్పాటు చేయాలని, మూత్రశాలల, మరుగుదొడ్ల వద్ద పోకిరిలకు, తాగుబోతులకు, దొంగలకు భయపడ్ని వారిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు స్థానికులు కోరుతున్నారు. ఏది ఏమైనా జిల్లా ఆర్టిసి ఉన్నంత అధికారులు, ఇటు ప్రభుత్వ నేతలు ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే పెర్కిట్ బస్టాండ్ లో ప్రయాణికులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# త్రిపురవరంలో మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన

**కోదాడ, ఫిబ్రవరి 27 (నినాదం):** అనంతగిరి మండలం త్రిపురవరం లో మహిళా సమైక్య భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ మాదాసు జ్యోతి కృష్ణ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మహిళల సాధికారతకు, స్వయం సహాయక సంఘాల సమావేశాలు మరియు వివిధ సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



శనివారం । తెలంగాణ
28 ఫిబ్రవరి 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## అభివృద్ధి ప్రధాన ధ్యేయం



**మంచిర్యాల ఫిబ్రవరి 27(నినాదం):** డివిజన్ అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం కి పెద్దపీట వేస్తున్నానని పేర్కొన్నారు. డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు అనుకొని ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపు చేశారు.

## చిల్లంచర్ల వరలక్ష్మి మృతి బాధాకరం .

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్



**కోదాడ, ఫిబ్రవరి 27 (నినాదం):** తెలంగాణ సాయుధ పోరాట యోధులు స్వతంత్ర సమరయోధులు దివంగతకామ్రేడ్ చిల్లంచర్ల రఘునాథం సతీమణి చిల్లంచర్లవరలక్ష్మి మృతి అత్యంత బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు, శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన ఆమె పార్థివ దేహాన్ని ఆయన సందర్శించి ఆమె పార్టీవ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు వరలక్ష్మి పార్థివదేహాన్ని సందర్శించి ఆమె మృతదేహం పై పార్టీ జెండాను కప్పి జోహార్లు అర్పించారు, అనంతరం వారు మాట్లాడుతూ మునగాల పరగాన ప్రజా పోరాటాల నిర్వహణలో రఘునాథం నిర్వహించిన ఉద్యమాలలో వరలక్ష్మి సహకారం మరువలేనిది అని, రఘునాథం అజ్ఞాతంలో ఉన్నప్పుడు 9 మంది సంతానంతో తన కుటుంబాన్ని అటు ఉద్యమానికి ఇటు కుటుంబానికి వారధిగా నిలిచిన ఉద్యమ శ్రేయోభిలాషివరలక్ష్మి అని వారన్నారు. ఆమె మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని, అయిన వారి జ్ఞాపకాలు చిరస్థాయిగా ఉంటాయి అన్నారు. సాయుధ పోరాట కాలంలో గానీ ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో గాని నిరంతరం రఘునాథం పోరాటంలో నిమగ్నమై ఉన్న సందర్భాలలో అనేకమంది నాయకులు కార్యకర్తలు, కుటుంబ శ్రేయోభిలాషులు కమ్యూనిస్టు ఉద్యమానికి కన్నతల్లిలా ఆదరించిందని ఆమె సేవలను ఈ సందర్భంగా కొనియాడారు, మునగాల పరగాన ప్రాంతంలో సిపిఐ పార్టీ విస్తరణ కోసం ఆమె నిర్వహించిన పాత్ర మరువలేనటువంటిది అని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు మామిడి చిన్న రాములు, సిహెచ్ సీతారాం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు మరియు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు అరవపల్లి శంకర్, ఓరుగంటి రవి, ఆమె కుటుంబ సభ్యులు ఠాగూర్ బాబు, కందిబండ సత్యనారాయణ, గిరి, అనసూయ, శ్రీదేవి, విజయలక్ష్మి, శారద, పద్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి27(నినాదం) :** వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో జాప్యంపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజారోగ్యంపై ఎందుకంత నిర్లక్ష్య ధోరణి అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. 2021 జూన్ 21వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. 24 అంతస్తులతో రెండు వేలకు పైగా పడకల సామర్థ్యంతో పలు జిల్లాల ప్రజలకు సేవలు అందించేలా ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూపకల్పన చేశామని తెలిపారు. రెండేళ్లలో 75 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 2023 వరకు కూడా ఈ ప్రాజెక్టు వేగంగా సాగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నెమ్మదించాయని చెప్పారు. కావాలనే ఈ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.

# చెన్నూర్ మున్సిపల్ చైర్మన్‌గా పెద్దింటి పద్మ బాధ్యతలు స్వీకరణ

### చెన్నూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: మంత్రి వివేక్ వెంకటస్వామి







చెన్నూర్ ఫిబ్రవరి 27(నినాదం) :: రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా చెన్నూరు మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తా మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు స్థానిక మున్సిపల్ పాలకవర్గశ బాధ్యతలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి వివేక్ మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ వైస్ చైర్మన్ నాయకపు వినయ్ కుమార్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సందర్భంగా మంత్రి చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గశ సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.....మంత్రి మాట్లాడుతూ చెన్నూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించి మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు.చెన్నూరు మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనేక వార్డుల్లో బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించిన మంత్రి, చెన్నూరు పట్టణ ప్రజలకు గోదావరి నుంచి శుద్ధజలాల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. త్వరలో పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు కూడా చేపడతామని వెల్లడించారు.పట్టణంలోని కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మారెమ్మవాడలో రహదారి సమస్యను పరిష్కరించామని గుర్తుచేశారు.మున్సిపాలిటీలో 100 కొత్త ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. దేవులవాడ, బబ్బేరు, చెలుక గ్రామాల రైతులకు సుమారు రూ.18 కోట్ల పరిహారం మంజూరు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు.మే నెలలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కోటి ఇరవై లక్షల రూపాయలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. చెన్నూరులోని ప్రతి వార్డులో సమన్వయంతో పని చేసి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ తోపాటు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ మాజీ జెడ్పిటిసి కార్నాసాగర్ రావు బాపురెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు....

# రహదారి భద్రత అందరి బాధ్యత: శ్రీరాంపూర్ సీఐ శ్రీలత

**మంచిర్యాల, ఫిబ్రవరి 27(నినాదం):** ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరాలని శ్రీరాంపూర్ సీఐ శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల డ్రైవర్లకు అరైవ్- అలైవ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పా టు చేయడంతో పాటు కంటి పరీక్షలు చేప ట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబం ధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించి ప్రాణాలను కాపా డుకోవాలని తెలిపారు.ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే మనందరి లక్ష్యంగా మార్చుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం లో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు ప్రతి వాహదరుడు తమ నేత్ర



పరీక్షలు,కంటి చూపు విసి బిలిటీ వయసు పెగడంతోపాటు దగ్గరి, దూరం చూ పు మీద ప్రభావం ఉంటుందని ప్రతి డ్రైవర్ తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి అని తెలి పారు. కొన్ని ప్రమాదలు మన కంటి చూపు సరిగా లేక కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయని తెలిపి పోలీస్ స్టేషన్ కి వచ్చిన కొంత మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకో వాలని తెలిపి నారు.దేశ వ్యాప్తంగా ప్రస్తుతం జరుగు తున్న రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్య మారిందని, ముఖ్యంగా ప్రమాదాలు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే కారణరమవుతోం దని ప్రధా నం హత్యలు కన్నా రోడ్డు ప్రమాదాల కారణంగా మరణించిన వారి సంఖ్య అధికమని. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడితే కొద్ది వరకు రోడ్డు ప్రమాదాలను నివారించగలం కాని వాహనదారులు తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అవలంబిస్తే ప్రస్తుతం జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టగల మని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడప టం కారణంగా వాహదారునితో పాటు ఇతరులు సై తం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని. మైనర్లను వాహనాలను అందజేయవద్దని, కారు నడిపే సమయంలో తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించడంతో ఇతర ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా మీ ఇండ్లకు చేరుకోవాలని తెలియచేశారు. కార్యక్ర మంలో శ్రీరాంపూర్ ఎస్సైలు సంతోష్ ,లక్ష్మి ప్రసన్న, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ పట్టణ అభివృద్ధి కృషి

### ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన, చైర్ పర్సన్, సమత వెంకట్ రెడ్డి





**చేవెళ్ల ఫిబ్రవరి 27 (నినాదం):** మున్సిపల్ పట్టణ అభివృద్దే లక్ష్యం మని చైర్ పర్సన్ సమతా వెంకట్ రెడ్డి పేకొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రిని కౌన్సిలర్ తో కలిసి సందర్శించారు.. ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ నూతన పాలకవర్గం, చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి లకు పూల బొకే అందజేసి, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ నెపద్యంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వంద పడకల నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు ఆసుపత్రి భవనాల మరమ్మతులు, కొత్త గదుల నిర్మాణం, ఆధునిక వైద్య పరికరాల ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లు, బెడ్లు మాతా శిశు సంరక్షణ, రోగుల భద్రత కోసం పటిష్టమైన భద్రతా నాణ్యమైన వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు.. లిసూపరెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఉన్న విద్యుత్, సరిపోవడంలేదని ఆసుపత్రులలో రోగుల



ప్రాణాలను రక్షించడానికి వెంటిలేటర్లు, ఆక్సిజన్ ఈసీజీ యంత్రా లు, డయాలసిస్ మిషన్లు, శస్త్రచికిత్స పరికరాలు వంటి అనేక విద్యుత్ ఉపకరణాలను, విద్యుత్ సరిపోక జనరేటర్ల సహాయంతో) ఉపయోగిస్తారు.. ఆస్పత్రిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు విద్యుత్ అందక, అంతరాయం కలుగుతుందని, నిర్మాణ పనులు సజావుగా జరగాలంటే, ఆస్పత్రికి సపరేటు ట్రాన్స్ఫార్మర్ అవసరమని,అన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు అధికంగా నీళ్లు అవసరమని నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు...

చైర్మన్ సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ....

పట్టణ అభివృద్ధిలో భాగంగా నిర్మించబోయే వంద పడకల ఆసుపత్రి పనులకు ఆటంకం కలవకుండా, విద్యుత్ ట్రాన్స్ఫారం, (నూతన ట్రాన్స్ఫార్మర్) ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని, అలాగే నీటి సమస్యలు తలెత్తకుండా, సపరేట్ పైపులైన్ ద్వారా నీటిని అందిస్తామని అన్నారు.. పనులకు అసౌకర్యం కలవకుండా ఏలాంటి సమస్యలున్న మాకు తెలపాలని,ఎలాంటి సమస్యనైనా పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు.. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, ఫిజియోథెరపీ సుధీర్, వెంకటలక్ష్మి డాక్టర్ అరుణా,స్వర్ణలత ప్రశాంత్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ప్రాధాన్యతక్రమంలో నిర్మల్ పట్టణ అభివృద్ధికి శ్రీకారం

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత**
**కోతుల సమస్య పరిష్కారానికి వారంలో చర్యలు**
**ప్రత్యేక పాలనలో చేసిన టెండర్లు...**
**పట్టణంలో తైబజార్ వసూలు రద్దు**
**శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి**
**పార్కుల ఏర్పాటు, ప్రదేశాల అభివృద్ధి**
"మీట్ ది ప్రెస్"లో నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి



**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 27.( నినాదం ):** చారిత్రక నేపథ్యం కలిగిన నిర్మల్ పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు పట్టణవాసుల సహకారం ఉండాలని నూతన మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం "మీట్ ది ప్రెస్" నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని సమస్యలపై తీసుకునే చర్యలు, అభివృద్ధి, ఆదాయ మార్గాలు తదితర అంశాలపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానమిచ్చారు.

**"ప్రత్యేక"టెండర్లు, తైబజార్ రద్దు......**

ప్రత్యేక అధికారుల పాలనలో చేసిన టెండర్లు, ప్రతిపాదనలతో పాటు పట్టణంలో వీధి వ్యాపారుల వద్ద నుంచి చేపట్టిన తైబజార్ వసూళ్లను కూడా పాలకవర్గం రద్దు చేసినట్లు ప్రకటించారు. ప్రజలు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించేలా చేపట్టిన వసూళ్లను తమ పాలకవర్గం రద్దు చేసినట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో రోడ్లు, ఫుట్ పాత్, చౌరస్తాలలో ఇష్టారీతిన ఏర్పాటుచేసిన వీధి వ్యాపారాలు, తోపుడుబండ్ల పైన సరైన పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారికోసం ప్రత్యేకంగా "వెండింగ్ జోన్ల"ను ఏర్పాటు చేస్తామని వారు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటాయించిన రూ 15 కోట్లకు సంబంధించి ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా స్థానిక సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకుండా టెండర్లను, ప్రతిపాదనలను చేశారని, వాటన్నిటిని రద్దు చేస్తున్నామని వివరించారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు ప్రతిపాదనలతో నూతన టెండర్లను వేస్తామని పేర్కొన్నారు.

**వారంలో కోతుల సమస్యపై చర్యలు.....**

నిర్మల్ పట్టణవాసులను ఇబ్బంది పెడుతున్న కోతుల సమస్యపై వారం రోజుల్లో పరిష్కార చర్యలను ప్రారంభించనున్నట్లు చైర్ పర్సన్ పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు తమ పాలనా కాలంలో చేపట్టినటువంటి కోతుల సమస్యల కట్టడి, తరలింపు వంటి కార్యక్రమాలను తిరిగి చేపడతామని వివరించారు. పట్టణంలో చాలా వీధులలో కోతులు కుక్కలు, పందులు ప్రధాన సమస్యగా మారాయని వీటిపై తమకు ఎన్నికల ప్రచారంలోనూ ఫిర్యాదులు వచ్చాయని వారు పేర్కొన్నారు. మున్సిపల్ నూతన పాలకవర్గ తొలి సమావేశంలోనూ కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తీర్మానించామని తెలిపారు. ఈ మేరకు వారం రోజుల్లోనే సంబంధిత చర్యలను చేపడతామన్నారు.

**ప్రజాసమస్యలు పరిష్కారానికి మార్నింగ్ వాక్....**

గతంలో 2014-19 పాలనకాలంలో నిర్మల్ మున్సిపాలిటీలో తాము వార్డులవారీగా మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించామని, వీటి ద్వారా నేరుగా ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు అదే రోజు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు. ఇప్పుడు కూడా వార్డులలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. నామమాత్రంగా కాకుండా మునిసిపల్ అధికారులు స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దాదాపుగా అదే రోజు సదరు సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతామని చైర్ పర్సన్ తెలిపారు.

**శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి......**

నిర్మల్ జిల్లాకేంద్రంలో మొత్తం 42వార్డులు ఉండగా, ఇందులో 16 శివారు కాలనీలు ఉన్నట్లు తాము గుర్తించామని వారు పేర్కొన్నారు. ఇవన్నీ కూడా కొత్తగా ఏర్పడినవి కావడంతో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు చాలావరకు లేవని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి సదరు సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. ఆయా కాలనీలలో స్థానికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి, ముందుగా వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. అలాగే మిగతా కాలనీలలో మౌలిక సదుపాయాలతో పాటు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

**త్వరలోనే ముఖ్యమంత్రి వద్దకు.....**

మున్సిపల్ కి సంబంధించి నిధుల కొరత వేధిస్తోందని, ఆదాయం సమకూర్చుకునేలా పన్నుల వసూళ్లను పకడ్బందీగా చేపడతామని చైర్ పర్సన్ తెలిపారు. నిర్మల్ పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తామని వెల్లడించారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రజలకు ఆహ్లాదం కోసం ప్రత్యేకంగా పార్కులు, చారిత్రక ప్రదేశాల అభివృద్ధి, ఒక మ్యూజియం ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రమైన నిర్మల్లో పెద్ద కార్యక్రమం నిర్వహించడానికి ఒక్క స్టేడియం కూడా లేదని, శివారు ప్రాంతాల్లో ఉన్నటువంటి అసైన్డ్ భూముల్లో అసైనీలతో మాట్లాడి, ఏర్పాటు చేసేలా ప్రత్యేక దృష్టి పెడతామని వెల్లడించారు.

**అవినీతి రహితంగా ఉండేలా......**

గత పాలకవర్గం హయాంలో మునిసిపల్ పైన అవినీతి ముద్రపడిందని, పలువురు అధికారులు సిబ్బంది ఏసీబీకి పట్టుపడటంపై ఫిర్యాదులు వచ్చాయని వారు తెలిపారు. ఇకనుంచి పురపాలక సంఘం ద్వారా పారదర్శకమైన పాలనతో పాటు, అవినీతి రహితంగా సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వారు వెల్లడించారు. ఎక్కడైనా మున్సిపల్ సిబ్బంది, అధికారులు లంచం అడిగినట్లు తెలిస్తే తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ల పైన వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతోందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని పాత బస్తీలో గల జౌలినాలా సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకునే దిశగా ప్రయత్నిస్తామన్నారు.

**ముంపు నివారణ చర్యలు చేపడతాం......**

నిర్మల్ జిల్లాకేంద్రంలో ప్రతి వర్షాకాలం పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి ప్రాంతాలలో వరద నివారణ చర్యలను ప్రారంభిస్తామని, ముంపునకు గురికాకుండా శాశ్వత పనులు చేపడతామని చైర్ పర్సన్ పేర్కొన్నారు.

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి........**

నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిందని ఈ సమస్యలను పరిష్కరించేందుకు పక్కాగా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారి పైన ఆక్రమణల తొలగింపుతో పాటు, వీధి వ్యాపారులకు, తోపుడుబండ్లకు ప్రత్యేకంగా వెండింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాత బస్టాండ్ ఏరియాలో వన్ వే ఏర్పాటు చేయాలన్న సూచనలు వస్తున్నాయని వీటి పైన పరిశీలిస్తామని చెప్పారు. పోలీసుల సహకారంతో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ అలాగే ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగు చర్యలు చేపడుతామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిలో గల డివైడర్లపై ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించి, సైకస్ జాతికి చెందిన మొక్కలను నాటుతామని తెలిపారు. ప్రజారోగ్యం పైన ప్రత్యేక దృష్టి పెడతామని, ఫుడ్ ఇన్ స్పెక్టర్ అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం, డిగ్రీ కళాశాల, ధర్మసాగర్ మినీ ట్యాంక్ బండ్ లపై వాకింగ్ ట్రాక్ లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. నిర్మల్ ప్రజలందరి సహకారంతో రాష్ట్రంలోనే పట్టణాన్ని ప్రథమ స్థానంలో ఉంచేందుకు ప్రయత్నిస్తామని వారు పేర్కొన్నారు.

## మహిళ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 27 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా మహిళలకు మహనీయుల చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గ జేవీసీ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పూర్వకాలంలో సమాజంలో పేరుకుపోయిన బాల్యవివాహాలు, సతీసహగమనం, జోగిని వ్యవస్థ వంటి దురాచారాలకు వ్యతిరేకంగా మహిళలు సాగించిన పోరాటాన్ని నిర్వాహకులు వివరించారు. అలాగే మహిళలకు చదువు, ఉద్యోగం, రాజకీయాల్లో పాల్గొనాల్సిన అవసరం లేదని వంటగదికే పరిమితం చేయాలనే మనువాద దృక్పథానికి ఎదురొడ్డి ఆనాటి మహిళా త్యాగమూర్తులు అలుపెరగని పోరాటం చేశారని పేర్కొన్నారు.ఆ మహనీయుల కృషి ఫలితంగానే నేడు మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలతో పాటు అంతరిక్ష గమనం చేస్తూ సమాజంలో శక్తివంతులుగా ఎదుగుతున్నారని తెలిపారు. కుటుంబానికి, దేశానికి అనేక విధాలుగా సేవలందిస్తున్న మహిళల అభ్యుదయంలో ఆనాటి త్యాగమూర్తుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.మహిళా అభ్యుదయానికి మార్గం చూపిన ఆ మహనీయుల చరిత్రను నేటి తరం అధ్యయనం చేయాలని, తద్వారా నేటి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే చైతన్యం కలగాలని లక్ష్యంగా ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కవ్వ లక్ష్మారెడ్డి, చెప్యాల ప్రకాష్, గాండ్ల పద్మ, ఏదులపురం తిరుపతి, కుమారస్వామి, పెట్టిం కుమారస్వామి, వేముల జగదీష్, బిల్ల శేఖర్, సర్పంచ్‌లు జాలి ప్రమోద్ రెడ్డి, గూడెల్లి కల్పన తిరుపతి రెడ్డి, సిద్ధమల్ల రమా రమేష్, ఉసిరెక్ల భారతి జయపాల్ రెడ్డి, మమత, ఏపీఎం వేణు, సీసీలు సదానందం, అశోక్, కమలాకర్, వి.సదానందం, వంగర గ్రామ సీఏలు చెప్యాల కమల, ఏనుక కవిత, మంచాల రజిత తదితరులు పాల్గొన్నారు.